# అప్పుడు మీరు-ఇప్పుడు మేమూ

''వాడు లేచే వేళయినట్టుంది. కాఫీ టిఫిన్ తయారుచెయ్యి. ఇవాళ గారెలు చేస్తానన్నాట్టున్నావు–?'' పడక్కుర్చీమీద పడుకున్న మంగపతి తువ్వాలుతో ముఖం తుడుచుకుని సగం లేచి కూర్చున్నాడు.

"మీకిష్టమని చెబితే అప్పుడే తయారుచేసేదాన్ని. అబ్బాయి కిష్టమని ఆలూ బోండా చేశాను. గారెలదేమిటి- రేపు చేస్తాలేండి. మరి- మీతో ముందుగా ఒక మాట చెబుతున్నాను. మీరు వాడితో కాస్త నిదానంగా ఆలోచించి మాట్లాడండి. వారూ వీరూ చెప్పిన మాటలు విని వాడిమీద విరుచుకుపడకండి. నొచ్చుకుంటాడు. మీకు వాడి స్వభావం తెలుసు కనుక మెల్లగా అసలు జరిగిందేమిటో తెలుసుకోండి. వాడు అట్లా చేశాడంటే బలీయమైన కారణమేదో ఉండే ఉంటుంది." ఆమెకు కొడుకును చూసినప్పటి నుంచీ మనసు ఛిన్నాభిన్నమయింది.

జరిగినదేమిటో కొడుకునడిగి తెలుసుకోవాలి. ఇకముందు జరగవలసిన దానికి సంప్రదించాలి. ఈ ఆలోచనలే ఆమె మనసులో సుళ్లు తిరుగుతున్నాయి. ఏమిటో అనుకోకుండానే ఆమెకు కళ్లల్లో నీళ్ళూరిపోతున్నాయి.

ఆమె అట్లా బాధపడుతుంటే ఆయన మనసులో ముల్లుగుచ్చినట్లవుతుంది. పైకి కనబరచకపోయినా ఆమె కంట తడిపెడితే ఆయన చూడలేరు.

''పార్వతీ, నాది రాతిగుండె అనుకుంటున్నావు కదూ ? నీలాగ నాకు కన్నీళ్లు పైకిరావు. అయినా వాడితో నేను మాట్లాడేటప్పుడు నీవు ఎదురుగా ఉండు" అన్నాడు మంగపతి.

ఇది ఒక విధంగా అపూయిత్యమే. అన్నిటికి తెగించిన వాళ్లు మొండిగానే ఉన్నారు ! పార్వతమ్మ ముఖం కందగడ్డలా అయింది. ఆమెకు ఆ మాట తలచు కుంటేనే కడుపు మసిలిపోతున్నది.

"జరిగిన దానిలో మన తప్పుకూడా కొంత ఉన్నదనిపిస్తోంది. సంబంధం

చూసి సంబర పడ్డాంగాని, ఆ కుటుంబాన్ని గురించిగాని పిల్లలను గురించిగాని మనం విచారించలేదు. ఎప్పుడు పెళ్ళిమాట ఎత్తినా ఇప్పుడు కాదనే అబ్బాయి కూడా పిల్లను చూసి మెచ్చి చేసుకుంటానన్నాడు ఆ సంతోషంలో మనం ఏదీ చూడలేదు అసలు ఇంకేమన్నా అడగాలని గాని విచారించాలని గాని తోచలేదు. అన్నీ అట్లా తోసుకువచ్చాయి. ఇదంతా గ్రహచారం."

"పార్వతీ, నీకు గ్రహాచారం మీద నమ్మకం ఉందా ?'' కాస్త ఆగి మళ్ళీ ఆమె ముఖంలోకి చూశాడు.

"ఉందో లేదో ? ఇదంతా దురదృష్టమనుకుందాం.''

''దానిమీదయినా నీకు నమ్మకం ఉందా ?" అంత బాధలోను ఆమెకు నవ్వొచ్చింది.

''మనిషన్నవాడు దేనినో ఒకదానిని నమ్మాలి. ఆ నమ్మకంతోనే బ్రతుకుతాడు. దేనిమీదా నమ్మకం లేనివాళ్ళున్నారా అసలు ?''

ఆమెనయితే ప్రశ్నించాడుగాని, ఆయనక్కూడా అనేక విషయాలలో నమ్మకాలున్నాయి.

''వాడితో ఏం మాట్లాడాలి ? అయినా వాడు తన మనసులో వున్నమాట మనతో చెబుతాడంటారా ? మనదగ్గిర వాడికి ఎంత చనువున్నా పెద్దవాళ్ళతో మనసులోవున్నమాట చెప్పలేడు. వాడి స్నేహితుడితో చెప్పినట్లుగా మనతో చెప్పలేడనిపిస్తోంది. కాశీపతీ వాడూ ఒక ఈడువాళ్ళు, మనసులు కలిసిన స్నేహితులు. అతడిని పిలిపించండి వాసు వచ్చాడని. ఏమంటారు ?'' సాలోచనగా అన్నది ఆమె.

''దానికేం ? పిలిపించమంటే పిలిపిస్తాను కాని, మూడో మనిషిని పిలిపించి వివరాలన్నీ చెప్పినట్లవుతుందేమోనన్న భయం అంతే" కాస్త ఆలోచించాడాయన.

''ఆ? ఇంకా దాపరికమేముంది అందులో ? వాళ్ళు ఇంటింటికీ వెళ్ళి పిల్లవాడు మమ్మల్ని మోసం చేశాడని చెప్పుకుంటున్నారు. వాళ్ళకు లేని అప్రతిష్ట ఇంక మనకా!'' ఆమె ముఖం చిట్లించింది.

''మనకే పార్వతీ. ఇంతవరకూ బజారు కెక్కని బ్రతుకులు మనవి.

దీనితో వీధికెక్కినట్లే. ఊరూ నాడూ మన సంగతి చెప్పుకుంటుంటే ఇంకా నీ చెవిన పడలేదా !''

భోజనం చేసి ఉయ్యాల బల్ల మీద పడుకున్నాడన్న మాటేగాని-వాసు నిద్రపోలేదు. తల్లి రమ్మంటోందని ఉత్తరం వస్తే - తనకూ చూడాలనిపించి బయలుదేరాడు. ఇదన్న మాట అసలు సంగతి. వాళ్ళ మాటలు పూర్తిగా వినాలని నిద్రపోతున్నట్టుగా పడుకున్నాడు. తను నోటితో ఏమిటని అడగకుండానే అంతా తెలిసి పోయిందిప్పుడు. ఇంక తనేం జవాబివ్వాలో ఆలోచించుకుంటూ దిగ్గున లేచి "అమ్మా టైమెంత ?'' అన్నాడు ఆవలిస్తూ.

ఆమె నవ్వుతూ, "చేతికి గడియారం పెట్టుకుని నన్ను టైమడుగుతావేంరా?"

"నిద్రమత్తులో అడిగానమ్మా. ఈ జీవుడికి ఇంత కాఫీ పోస్తావా ? అప్పటి నుంచీ సొద పెడుతున్నాడు'' ఎంత పెద్దవాడయినా అతడు తల్లి దగ్గర పసివాడిలా మసలుతాడు. ఆమె కది చాలా ఇష్టం. బొండాలు తింటూ 'అమ్మా నీ చేతివంట తిని ఎన్నాళ్ళయిందో?' అంటూ కాఫీ గ్లాసు చేతబట్టాడు.

ఎన్నాళ్ళయిందో నన్నమాట వినేసరికి ఆమెకు కడుపులో మసలుతున్నది పైకి బుస్సున పొంగిపోయింది. బయటపడట మిష్టంలేక ఆమె వంట ఇంట్లోకి వెళ్ళి గ్లాసెడు నీళ్లు తాగి కాస్త తమాయించుకున్న తరువాత బయటికి వచ్చింది.

"మరి కొంత సేపటికి వాసు ''అమ్మా నేను అలా ఊళ్ళోకి వెళ్ళొస్తాను'' అంటూ బయలుదేరాడు. దారి చక్కగా కాశీపతి ఆఫీసుకు తీసుకు వెళ్ళింది. కాశీపతి ఫైల్సు కట్టబోతున్నాడు. మిత్రు లిద్దరు ఒకరినొకరు కలుసుకున్న సంభ్రమంతో కాసేపక్కడే కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. వాసు వద్దంటున్నా హోటలుకు దారితీశాడు కాశీపతి. అక్కడినుంచి ఇద్దరూ కాలినడకన కాలవ ఒడ్డుకు వెళ్ళి ఓ చెట్టుకింద కూర్చున్నారు జేబురుమాళ్ళు పరుచుకుని.

''అమెరికా కబుర్లు చెప్పరా వాసూ, నీ వొక్కడివీ అక్కడికి వెళ్ళి హాయిగా ఉన్నావు. అక్కడ నాకేదన్నా ఉద్యోగం చూసి పెట్టరాదూ ?"

వాసు ఓ పుల్ల అందుకుని ఇసుకలో గీతలూ, గళ్ళూ గీస్తున్నాడు.

"నిన్నేరా వాసూ. నీవు ఇప్పుడప్పుడే రావనుకున్నాను''

"అమ్మా నాన్నా రమ్మనిరాశారు. ఏదో అర్జంటు పని అన్నారు. వాళ్ళా పెద్దవాళ్ళవుతున్నారు. బెంగనిపించినపుడల్లా రాస్తుంటారు. వాళ్లు రమ్మనప్పుడల్లా నేను రాగలనా? ఏదో ఈసారి నాకూ చూడాలనిపించి వచ్చాను".

"సారీ రా వాసు! అప్పటినుంచీ చెప్పాలనుకుని మర్చిపోయాను. నిరుడు నీ పెళ్ళికి ఇన్విటేషను పంపావు. నేనా పల్లెటూళ్లో కామెర్లతో మంచమ్మీదున్నాను. డాక్టరు కదలవద్దన్నాడు. ఏంచెయ్యను? ప్రాణం నీ దగ్గర-శరీరం మంచమ్మీద అయితే ఇప్పుడు మీరిద్దరూ అక్కడే వుంటున్నారా?''

వాసు మాట్లాడలేదు. గీసిన గీతలు వేలితో చెరిపి కొత్తవి గీస్తున్నాడు.

వాసును వింతగా పరిశీలనగా చూశాడు కాశీపతి. పెళ్ళికి రాలేకపోయానంటే మాట్లాడడేం? అసలా ప్రశ్న వాసే వేయవలసింది. అది లేకపోగా 'ఇద్దరూ' అనగానే వెర్రి చూపులు చూస్తాడేమిటి? వాసు భుజాలు ఊపాడు కాశీపతి జవాబు కోసం.

అసలే ముడుచుకుని ఉన్న వాసు ముఖం మోకాళ్ళ మీదికి జారింది.

"ఏమిట్రా పసిపిల్లాడిలా చేస్తున్నావు? సంగతేమిటో చెప్పరా బాబూ!'' రెండు చేతులతో అతడి ముఖం పైకెత్తి కళ్లల్లోకి చూశాడు కాశీపతి.

'ఒరే కాశీ. నన్నిప్పుడేం అడగకు. రేపు మళ్ళీ కలుసుకుందాం'' విసవిసా నడుచుకుంటూ వెళ్ళి రీడింగ్ రూమ్ చేరుకున్నాడు.

కాశీపతి తెల్లబోయాడు. శుభలేఖ చూడగానే అనుమానించాడు. పసివాడి హృదయం నలిగి నట్టుంది అనుకున్నాడు. చేతులు దులుపుకుంటూ లేచి ఆలోచిస్తూ అడుగులు వేస్తున్నాడు. అంతలో అతడి ముఖం కంద గడ్డలా అయింది. కాళ్ళీడ్చుకుంటూ ఇంటిదారి పట్టాడు. తటాలున అతడికి చిన్నప్పుడు చదివిన సహస్రశిరచ్ఛేద అపూర్వ చింతామణి కథ జ్ఞాపకానికి వచ్చింది. వాసూ తనూ ఒకరి చేతిలోంచి ఒకరు లాక్కొని చదువుతూ ఉండేవారు. ఇద్దరికీ కొన్ని పేజీలు కంఠతః వచ్చాయి కూడా.

రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి వెళ్ళగానే "ఇంత ఆలస్యమైందేమిట్రా వాసూ? ఎక్కడికెళ్ళావు?" అడిగాడు తండ్రి.

ఏం చెబుతాడోనని తల్లి అక్కడే నిలబడ్డది.

''రీడింగ్ రూమ్‌కి వెళ్ళాను. అక్కడి నుంచి ఇటే వస్తున్నాను.''

ఆ రాత్రి తండ్రితో పొలాల విషయం మాట్లాడుతూ అమెరికాలో తనకు దొరకని కందిపొడి గుమ్మడికాయ వడియాలూ తల్లి కొసరి కొసరి వడ్డిస్తుంటే ఆప్యాయంగా భోజనం చేశాడు.

ఆ మరునాడు వాడెందుకు వస్తాడు సిగ్గుతో చితికి పోతున్నాడు అనుకుంటూనే కాశీపతి ఆ కిందటి రోజున కూర్చున్న చోటకి వెళ్లాడు. అప్పటికే అక్కడ కూర్చున్న వాసుని చూసి ఆశ్చర్యపోయాడు. అతడు చిటికెలు వేస్తూ ఘంటసాల పాడినట్లుగా మంద్ర స్థాయిలో పాటలు పాడుకుంటున్నాడు. చిన్నప్పుడు ఇద్దరూ లలిత సంగీతం పాడటంలో పోటీలు పడేవారు. ఘంటసాల వాళ్లకాదర్శ గాయకుడు. ఏకలవ్యుడు మాదిరిగా ఆయన రికార్డులు దగ్గర పెట్టుకుని వాటితో కూడా పాడుతూ ప్రాక్టీసు చేశారు.

"ఏరా వాసూ ఎంత సేపయింది వచ్చి? మొత్తానికి మాటనిలబెట్టుకున్నావు'' అతడి పక్కన చోటుచేసుకుని కూర్చుంటూ బుజమ్మీద చెయ్యివేశాడు ఆప్యాయంగా.

వాసు అతడిని చూసి నవ్వాడు. ఆ నవ్వు కాశీపతికి తెలిసినది కానీ చూసినది కానీకాదు.

''మనం బాల్య స్నేహితులం కదా. ఒకరి మనసులొకరు బాగా ఎరిగిన వాళ్ళం కాకపోతే నీవు నాకంటే కొద్దిగా శ్రీమంతుడివి.

ఇప్పుడు విదేశంలో వుండి బాగా డబ్బు సంపాదిస్తున్నవాడివి. నీ మనసులో మసులుతోన్నదేమిటో నాతో చెప్పటానికేం? అయితే నేను ఆర్చేవాడిని తీర్చేవాడిని కాననుకో"

వాసు పెదవులు కదులుతున్నాయి. కాని నోటి నుంచి మాట బైటికి రావటంలేదు.

"నేను నీ ప్రాణమిత్రుడిననుకున్నాను. నీ బాధేమిటో నాతో చెప్తావనుకున్నాను. చెప్పరా'' కాశీపతి మళ్ళీమళ్ళీ ప్రశ్నిస్తున్నాడు గడ్డం పట్టుకుని.

''ఏమని చెప్పను ? తలుచుకోవటానికే అసహ్యంగా ఉంది. అమెరికాలో యువతలో ఉండే అలవాట్లూ—వాళ్ళ విచ్చలవిడితనమూ ఆడపిల్లలూ మగపిల్లలూ ఈతలు కొడుతూ ఎక్స్‌కర్షన్లూ పార్టీలూ అంటూ రాసుకుంటూ పూసుకుంటూ తిరుగుతుంటే నేను ఏవగించుకునేవాడిని. వాళ్ళతో కలియలేక దూరదూరంగా ఉండేవాడిని. వాళ్ళు నన్ను బహిష్కరించి కంట్రీబాయ్ అంటూ వెక్కిరించే వాళ్ళు. అందుకు రోషపడితే ఆ గుంపులో ఆడపిల్లలతో పరుగులు తియ్యాలి ఆడాలి. వాళ్ళ ఆటలు ఎలా ఉంటాయంటే ఇద్దరమ్మాయిలు నన్ను కిందపడేసి బీచిలో యీడ్చుకుంటూ నాలుగుమైళ్ళు తీసుకెళ్లారు. పైగా విజయగర్వంతో పక పక నవ్వులు ఇది చూసి మిగతా పిల్లలు హేళన చేయడం నేను సహించలేక పోయాననుకో. వాళ్ళంతా నవ్వుతూ చప్పట్లు కొడుతూ ఉంటే నా మనసు ఉడికి పొయ్యేది''

"నీవు మరీ వాళ్ళన్నట్టే బైతువి. వాళ్ళతో కులాసాగా తిరిగితే ఏం పోయింది ? ఆ దేశంలో నలుగురితో పాటు ఉండాలిగాని నీవు మాత్రం ముడుచుకుని కూర్చొవటమెందుకు చెప్పు ? వాళ్ళంతా నవ్వారంటే నవ్వరూ ?"

''అదికాదురా ఆడపిల్లలు మరీ మీదికి మీదికి వస్తుంటే నాకు వెగటనిపించింది- అక్కడి ఆడపిల్లలు....''

"ఆ దేశం తీరురా బాబూ వాళ్ళకది తప్పనిపించదు" విరగబడి నవ్వాడు కాశీపతి.

''ఎందుకా నవ్వు ? మగపిల్లలను అనుకరించే ఆడపిల్లలన్నా ఆడపిల్లలను అనుకరించే మగపిల్లలన్నా నా కసహ్యం మగ పిల్లలేదో ఘనులని ఆ పిల్లలు వాళ్ళననుకరించి ఆ వేషాలు వేస్తుంటే నేను చూడలేక పోయాను. ఆడ పిల్లలలో ఉండే సహజమైన సౌకుమార్యం-నాజూకుతనం-స్త్రీ సహజమైన నమ్రత ఏకోశాన నాకు కనబడలేదు.''

"అందుకని ?''

"అందుకని పెరిగి విరిగిన అనాగరికత నాకు నచ్చక, మన దేశం వచ్చి సహజ లావణ్యంతో మన దేశపు కట్టు బొట్టులతో సిగ్గూ బిడియము అంటే ఏమిటో తెలిసిన అమ్మాయిని పెళ్ళిచేసుకుందా మనుకున్నాను. అమ్మా నాన్నా

కూడా పెళ్ళికి తొందర పెట్టారనుకో. పెళ్ళిచూపులు మొదలయ్యాయి. కట్నం తీసుకోవద్దని ముందే చెప్పాను. అమెరికాలో ఎవరినో పెళ్ళి చేసుకుంటాడేమోనని భయపడుతున్న అమ్మా నాన్నా నేను వచ్చినందుకే సంతోషపడి సరే సరే నన్నారు ఒకమ్మాయిని చూడటానికి వెళ్లాము పిల్ల చూడటానికి బాగుంది. కాని నన్నొక రౌడిని చూసినట్టు చూడటం మొదలు పెట్టింది. ఈ లేటేజర్కి చూసి అసహ్యించుకున్నట్టుగా ముఖం పెట్టింది. చూస్కో నా పంజాదెబ్బ అన్నట్టు చూసింది.''

"ఎవరువాళ్ళు ? ఏ ఊరు ? ఏం పేరాయనది ?" ముఖం పక్కకు తిప్పు కుని చెప్పాడు వాసు.

"సిగ్గుపడుతూ తలవంచుకునే పిల్ల-అణగి మణగివుండే పిల్ల కావాలంటే ఈ కాలంలో దొరుకుతార్రటా వెర్రి నాయనా !''

''ఛాఛా అటువంటి పిల్లలూ నాకు నచ్చరు. నా కంటే తక్కువా వద్దు. అధికారం చెలాయించాలని చూసే ఎక్కువా వద్దు. నాతో సమానంగా గౌరవాభి మానాలు ఇచ్చి పుచ్చుకునే అమ్మాయి కావాలి. 'అధికారం—బానిసత్వం' ఈ రెండు మాటలూ అనకూడదు. వినబడ కూడదు. అబ్బాయిల అహంకారాన్ని అణచటానికి ప్రయత్నించే అమ్మాయిలకు ఆమడ దూరం నేను. ఒకరినొకరు ఆకర్షించుకుంటూ ప్రేమించుకుంటూ బతకాలిగాని అబ్బాయిగాని అమ్మాయిగాని గజ గజ వణుకుతూ బతకమంటే నాకు గిట్టదు'' ఆవేశపడుతున్నాడు వాసు.

"అబ్బబ్బ బోరు కొట్టించావు 'నాకు నచ్చదు-నచ్చదు అంటూ. మరి నీకు నచ్చిన సంబంధమేదో చూసి చేసుకున్నట్టున్నావు ?"

"చేసుకోవాలనే అనుకున్నాను. పగ తీర్చుకోవటానికి వచ్చినట్టుగా ఒక అమ్మాయి పెళ్ళిచూపులకనివచ్చి ఎదురుగా కూర్చుంటే మొదట భయపడినమాట నిజమే. అందచందాలు చూసి భ్రమసి తరువాత సర్దుకుంటుందిలే అని ఒప్పు కున్నాను. పెళ్ళిలో ముఖం ఏ మాత్రము మార్పు లేకుండా అలాగే పెట్టింది. ఏదో చిన్నతనమనుకున్నాను. మంచీ మర్యాదా అనునయంగా నేనే నేర్పుదామను కున్నాను గాని-మొదటి రాత్రి తలుపవతల పిన తండ్రితో ఘర్షణ పడుతున్న అమ్మాయి మాటలు చెవులారా విన్నాను.

"అమ్మాయీ జాగ్రత్తగా మసులుకో. అతడు చాలా మంచివాడు బుద్ధిమంతుడు! పొగరబోతని సించుకోకు" అంటున్నాడు పినతండ్రి.

''బాదాయీ నీ మగధీరుడు మాటలు పోనిచ్చావు కాదు? మీ పురుషాధిక్యత నా దగ్గిర చెల్లదు. కొంచెం హెచ్చు తగ్గయినా నా ప్రతాపాన్ని రుచి చూపిస్తాను" అంటోంది అమ్మాయి.

"నా ఒళ్ళు జలదరించిందనకో. ఆ గది బైటకి వెళ్ళటానికి రెండు ద్వారాలున్నాయి. వెంటనే నేను పక్క తలుపు తెరుచుకుని చెట్లనీడన అడుగులు వేసుకుంటూ నా సామాను వున్న చోటకు వెళ్ళి చప్పుడు చేయకుండా నా సూటుకేసందుకుని బస్సందుకున్నాను. పెళ్ళివారంతా భోజనాల సందడిలో వున్నారు. నేనక్కడినుంచి అంచెలంచెలుగా బొంబాయి చేరుకుని నాకు టికెట్ దొరికేవరకూ అక్కడ వుండి తరువాత అమెరికా చేరుకున్నాను. అమ్మానాన్న గాబరా పడి వెతకటం మొదలు పెట్టారట. పెళ్ళివారు అల్లరికిదిగి నన్ను నానా మాటలు అని వంక పెట్టారట. ఆ మరునాడు అమ్మా నాన్న దిగులుపడ్డ ముఖాలతో ఇల్లు చేరుకున్నారట. పదిరోజులయిన దగ్గర్నుంచీ పిల్లకు భరణమివ్వమని వాళ్ళు మనుషులను పంపటం మొదలు పెట్టారట'' వాసు ఆవేశంతో ఆయాసపడిపోతున్నాడు.

కాశీపతికి నవ్వొస్తోంది. ఆపుకోలేక పోతున్నాడు.

"ఎందుకా నవ్వు'' వాసుకి మితిమీరిన కోపం వచ్చేసింది.

కాశీపతి వాసును అవమాన పరచాలని నవ్వలేదు. తనకయిన అనుభవమొకటి జ్ఞాపకమొచ్చి ఆ రోషము నవ్వు రూపంలో వెలువడింది.

కాశీపతి రెండేళ్ళ కిందట ఆ అమ్మాయినే చూడటానికి వెళ్ళాడు. పయిజామా కుర్తాలో అమ్మాయి ఠీవిగా వచ్చి కొట్టటానికి చూస్తున్నట్టు చూసింది. ఆ అమ్మాయి అందం, నదురు, బెదురు లేని నడక, అడిగిన ప్రశ్నలకు పెడసరంగా జవాబిచ్చే పద్ధతీ. మొదలైనవన్నీ అతడికి నచ్చాయి. ఆ అమ్మాయి ఈ కాలపు పిల్ల అని సంబరపడ్డాడు. తనకింత ఆధునిక యువతి లభించటం తన అదృష్టమనుకుని మురిశాడు. ఆ అమ్మాయి సర్టిఫికెట్లు గోడలకు తగిలించి ఉంటే కుతూహలం కొద్దీ చూసి మురిసిపోయాడు అవును ఆడపిల్లలకు నేటి సమాజంలో రక్షణకోసం ఇటువంటి కోర్సులలో శిక్షణ అవసరమే ననుకున్నాడు.

కాని చివరకేమయింది ?

పెళ్ళి చూపులవగానే లేచి లోపలికి వెళ్ళిన అమ్మాయి స్నేహితులు కాబోలు గొల్లున నవ్వుతూ చుట్టూచేరి ఆమెను ప్రశ్నిస్తున్నారు. "ఏమే నీకు కంటికి అనాడా ? ఎలా ఉన్నాడ''ని

''మీలా పిరికిదాన్ననుకున్నారా? నేను సూర్యప్రభను ఏమనుకున్నారో ?"

అందరూ విరగబడి నవ్వారు.

''తెలుసులేవే. మాకు మాత్రం ఆతడిని చూస్తే జాలేస్తోంది.

కాశీపతికి ఇంక అక్కడ నిలవబుద్ది కాలేదు. మేనమామతో పెళ్ళి చూపులకు వచ్చానని వివరించాడు. మిక్శ్చరు తింటున్నవాడల్లా దిగ్గున లేచి చెప్పులు వేసుకోకుండా ఇంటికి నడిచి వచ్చాడు. ఆ తరువాత పెళ్ళివారు ఇంటి చుట్టూ పది రోజులు తిరిగారు జవాబు కోసం. ఏదో సమాధానం చెప్పి వాళ్ళను పంపించేసరికి పెద్దలు దిగివచ్చినట్లయింది.

"నన్నన్నావుగాని కాశీ-నీవెందుకురా తలవంచుకున్నావు ? వీపుమీద తట్టాడు వాసు.

''సరేలేరా మళ్ళీ కలుసుకుందాం నీవిప్పుడప్పుడే వెళ్ళవుగా ?''

ఇద్దరూ లేచారు.

అప్పటికింకా సినిమా మొదటి ఆట విడవలేదు. వాసు ఇల్లు చేరుకునేసరికి వాకిట్లో కుర్చీ మీద కూర్చుని తండ్రితో మాట్లాడుతున్న ముకుందాచారి కనబడ్డాడు.

''ఓ అబ్బాయిగారా ? ఎప్పుడొచ్చారు ?'' అన్నాడు.

''రెండు రోజులయింది ఆచారిగారూ ? మీరింకా అదేపని చేస్తున్నారా ?'' వెనక్కు తిరిగి ప్రశ్నించాడు వాసు.

''ఏమిటి బాబూ ఏమిటి ?''

''అదేనండీ, పెళ్ళికూతుళ్ళ పక్షాన వరుళ్లను వెదకటం"

''అవును బాబూ. అసంగతే నాన్నగారితో మనవి చేస్తున్నాను. అమ్మాయి

వజ్రపు తునకే ననుకోండి. చదువా-బి. ఏ. ప్యాసయింది. సంగీతమా-ఇంక చెప్పనక్కరలేదు. టి. వి. ప్రోగ్రాములు కూడా ఇస్తోంది. ఉద్యోగమా-స్త్రీ సంక్షేమశాఖలో చేస్తోంది. ఆ నమ్రత, ఆ మర్యాద మరెవ్వరిదగ్గరా చూడలేదు. ఒక్కసారి చూస్తే కళ్ళు తిప్పుకోలేని అందం. సంబంధం చెయ్యిజార విడుచుకో కూడనిది. అందులో మీరు తప్పకుండా చూడతగినది'' ఇంకా చాలా చెప్పవల సింది వున్నట్టు చూశాడు.

''ఆచారిగారూ మీకు కృష్ణదేవరాయలూ చిన్నమదేవీ కథ తెలుసుకదూ? కత్తితో పడగ్గదిలో ప్రవేశించి భంగపడ్డది. ''

"అర్ధమయింది బాబూ—అర్థమయింది. కాలం మారింది బాబూ. పెళ్ళి చూపులతీరూ ప్రశ్నలతీరూ మారింది. అమ్మాయిలూ వెనకటిలా లేరు ఆ మాట నిజమే. వాళ్ళ మాటల్లోనూ సబబున్నట్టే కనబడుతుంది. అంతమాత్రం తిరుగు బాటు లేకపోతే ఆడది బతకలేదు బాబూ''.

వేడినీళ్ళు మరుగుతున్నట్టు మరుగుతోంది వాసు మనసు.

ఆచారిగారూ-ఈ మధ్యేమయినా పెళ్ళిళ్ళు కుదిర్చారా?''

''లేకేం? అయిదారు పెళ్ళిళ్ళయ్యాయి. మరి నాలుగు లగ్నాలు పెట్టాను."

"పెళ్ళి కొడుకులు బతికే వున్నారా!''

"లక్షణంగా చిలకాగోరింకల్లా కాపరాలు చేసుకుంటున్నారు''

"మీరు పెళ్ళిళ్ళు జరిపిస్తారు. అటువాళ్ళని ఇటు వాళ్ళని పొగిడి ముళ్ళు పెడతారు. ఆ పైన వాళ్ళెట్లా వుంటారో మీరేం చూస్తారు?''

''బాబూ, ఎవరో వొకరు సంధానపరచాలికదా, మీలో మీరు కాలేజీల్లోనూ, ఆఫీసుల్లోనూ కుదుర్చుకుని చేసుకుంటే నా వంటివాళ్ళకు బాధేముంది? అప్పుడు మమ్మల్ని అనటానికి అవకాశంలేదు. ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే అమ్మాయి ముఖంలో కళ వుంది బాబూ. అది చెప్పటానికే వచ్చాను. నన్ను ఆటలు పట్టించినా సరేగాని. , శకుంతలను పెళ్ళి చేసుకుంటే బాబు, చాలా చక్కగా వుంటుంది. పొందికతో మర్యాదగా మాట్లాడుతుంది. అన్నట్టు చెప్పడం మరిచాను. ఆమె గొప్ప క్రీడా కారిణి. హాకీనా అదేమిటి? ఆ ఆటలో ఎన్ని కప్పులు గెలుచు కుందో? నామాట నమ్మకపోతే ముందు అమ్మగారిని చూసిరమ్మనండి ఆ తరు వాత మీరు చూడండి.

వాసు లోపలికి వెళ్ళగానే ముకుందంగారు నవ్వుకున్నారు.

"అమ్మా పార్వతమ్మగారూ ! చిన్నపిల్లల మాటలు పట్టుకుని ఈ సంబంధాన్ని వదులుకోకండి. అయినా ఒక్కమాట. మగపిల్లలు మాత్రం చిలిపి ప్రశ్నలు వెయ్యరూ ? మగపెళ్ళి వారి ప్రశ్నలూ వరుడి ప్రశ్నలూ అవమానకరంగా వున్నాయని వధువైపువారు అనుకునే రోజులు ఇంకా గడిచి పోలేదు కదా ? అక్కడా అక్కడా ఇంకా కనబడుతూనేవున్నాయి. అలాగే ఆడపిల్లలూనూ. వాళ్లూ మొదలు పెడుతున్నారు చిలిపిగా పొగరుగా ప్రశ్నించటం.''

పార్వతమ్మకు నవ్వొచ్చింది.

"ఆడపిల్లలే కాదండోయ్. వాళ్ల తల్లిదండ్రులుకూడా మీరిపోయారండీ. అబ్బాయికి అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళూ వుండకూడదుట. తల్లిదండ్రులు చదువు చెప్పించి, ఉద్యోగం వచ్చిన తరువాత ఆస్తి అప్పగించి, విడిగా ఉండాలిట. ఒక్క పిల్లవాడున్న సంబంధంకోసం గాలిస్తున్నారు.''

"అమ్మా నేనొక్క మాట చెబుతాను వినండి. ఇదివరలో మగ పెళ్ళివారిది పై చెయ్యి. ఇపుడు ఆడ పెళ్ళివారిది. ఏమంటారు ? అప్పుడూ పెళ్ళిళ్లు ఆగిపోలేదు ఇప్పుడూ ఆగటంలేదు. ఆడపిల్లలు కూడా ప్రశ్నించటానికి మాకూ స్వాతంత్ర్యం ఉందంటున్నారు. కాలాన్ని చూస్తూ మనం మాత్రం కాదనగలమా చెప్పండి.

పార్వతమ్మా ఆమె పెనిమిటీ తమకాచేదు అనుభవం కలక్కపోతే ఆ మాటలకు పక్కున నవ్వేవారే.

గదిలో ఉన్న వాసు మాత్రం పెదవులు సాగదీసి ముడిచాడు.